# ఆదుకోవడమే ఆమె ఛాయిస్!

**ఒక్క దీపం చాలు... వేల దీపాల్ని వెలిగిస్తుంది! మంచి ఆలోచన ఒక్కటున్నా చాలు... మరిన్ని సరికొత్త ఆలోచనలకు ఊతమిస్తుంది! మన ఛాయిస్ మంచిదైతే - 'మై ఛాయిస్'లు తెలుస్తాయి. అంజలి రుద్రరాజు లాంటి అమ్మాయిల్ని ఆదర్శపథంలో నడిపిస్తాయి!**



అది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఎన్నో ఆలోచించి ఇదిగో ఇదీ 'మై ఛాయిస్' అని తీసుకున్న నిర్ణయం. దాన్ని తండ్రికి చెప్పింది అంజలి. "అదేమిటమ్మా...' అంటూ నివ్వెరపోలేదాయన! "అమెరికాలో అంతమంచి ఉద్యోగం... అన్ని లక్షల సంపాదన... వాటిని మానుకుని ఇక్కడ స్థిరపడతావా? చదువుకున్న పిల్లవి నాతో కలిసి వ్యవసాయం చేస్తావా? " అనీ అనలేదాయన. ఆమె ఆలోచనను మెచ్చుకున్నారు. 'నీ జీవితం... నీ ఇష్టం' అంటూ పైకి విస్తరించాలని ఆరాటపడుతున్న పాదుకు పందిరి వేశారు.

✦✦✦✦✦✦✦

అంజలి తండ్రిది అమలాపురం దగ్గర 'గోడి' అని చిన్న పల్లె. అక్కణ్నుంచి ఆయన చాలాకాలం క్రితమే హైదరాబాద్ వచ్చి, వ్యవసాయం ఆరంభించారు. సంకర జాతి విత్తనాలకూ, రసాయనిక ఎరువులకూ ఆయన దూరం. పుష్టినీ, రుచినీ, ఆరోగ్యాన్నీ ఇచ్చే సేంద్రియ పంటల్ని పండిస్తూ, ఓ వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం మొదలుపెట్టారు. అ, ఆల నుంచి డిగ్రీ వరకూ హైదరాబాద్‌లో చదువుకున్న అంజలికి తండ్రి పద్ధతులు నచ్చాయి. ఎంబీఏ చదువుకోసం న్యూయార్క్ వెళ్లి, డిగ్రీ చేతికందాక అక్కడే మంచి ఉద్యోగంలో స్థిరపడ్డా తన ఆలోచనలన్నీ సేంద్రియ వ్యవసాయం గురించే. తండ్రి వేసిన ద్రాక్షతోటలూ, పచ్చదనంతో కళకళలాడే వ్యవసాయ భూములూ ఆమె కళ్లలోనూ, కలల్లోనూ మెదిలేవి. అందుకే తండ్రిని చూడ్డానికి ఏడాదికి రెండు సార్లు భారత్‌కు వచ్చేది. తండ్రినీ, తల్లిలాంటి వ్యవసాయాన్నీ విడిచిపెట్టడానికి మనసు రాక ఇక్కడే ఉండిపోవాలనిపించేది. బాగా ఆలోచించాక అది బడికి వెళ్లడానికి మారాం చేసే పసితనపు చేష్టకాదనీ, తన భవిష్యత్తును తీర్చిదిద్దే మంచి ఎంపికనీ అంజలి అర్థం చేసుకుంది. ఇదిగో... ఇదీ మై ఛాయిస్ అని తండ్రికి చెప్పింది. ఆయన అంగీకరించారు. ఆశీర్వదించారు. సేద్యం కోసం నడుం బిగించిన న్యూయార్క్ ఎంబీఏ పట్టభద్రురాలు అంజలి - వ్యవసాయ క్షేత్రంతో పాటూ మరో కార్యక్షేత్రం తనకోసం ఎదురు చూస్తోందని త్వరలోనే గ్రహించింది.

✦✦✦✦✦✦✦

"నా పేరు ఎల్కా, మాది జర్మనీ.." - ఢిల్లీలోని ఓ ఎన్జీఓ కార్యక్రమంలో అంజలితో పరిచయం చేసుకుందామె. తను 'ఇంటర్నేషనల్ ఆస్ట్రేలియా'లో పెద్ద ఉద్యోగి. "మంచి ఉద్యోగమే! కానీ మనసు మాత్రం సంపాదన మీద లేదు. ఏదో చేయాలని ఆరాటం" - ఎల్కా అలా అనగానే అంజలి కళ్లు మెరిశాయి. ఆలోచనలు కలుస్తున్నాయి. "ఏం చెయ్యాలనుకున్నారు? " అంజలి అడిగింది. "ఇండియా గురించి బాగా స్టడీ చేశాను. ఇక్కడ ఆడవాళ్లపై హింస ఎక్కువ. వాళ్లకు ఏదో రూపంలో సాయపడాలి. అందుకే ఉద్యోగం మానుకుని భర్తా, పిల్లలతో ఇక్కడికొచ్చేశాను" ఎల్కా మాటలు విని అంజలి కదిలిపోయింది. ఆమె చేతులు పట్టుకుని అభినందించింది. "మీతో కలిసి సేవ చేయడానికి నేనూ సిద్ధంగా ఉన్నాను" ఎల్కాను అభినందించేందుకు పట్టుకున్న అంజలి చేతులు ఆర్ద్రంగా బిగుసుకున్నాయి.

✦✦✦✦✦✦✦

వ్యవసాయం మీద అభిలాషతో హైదరాబాద్ చేరుకున్న అంజలి బయో డైనమిక్ వ్యవసాయం గురించి అధ్యయనం చేసింది. దానికి సంబంధించి గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో శిక్షణ తీసుకుంది. అప్పుడే వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆమె దృష్టిని



ఆకర్షించాయి. వ్యవసాయంతో పాటూ సమాజానికి సాయం చేయడం మనిషిగా తన బాధ్యత అనుకుంది. అందులో భాగంగా ఎన్జీఓలతో అనుబంధాన్ని పెంచుకుని, వాటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. అలాంటి కార్యక్రమంలోనే ఎల్కాతో పరిచయం! ఇద్దరి ఎంపికలూ ఏకమయ్యాయి. 'మై ఛాయిస్' స్వచ్ఛంద సంస్థ నిర్మాణానికి పునాదులు వేశాయి! ఈ పునాదులకు కార్యక్షేత్రం - హైదరాబాద్ నగరం. అక్కడ గృహ హింస పెచ్చరిల్లే ప్రాంతాలెన్నో. మహిళలపై అత్యాచారాలూ, ఆడపిల్లల అక్రమ రవాణా, కత్తిగాట్లకు గురవుతున్న అబలల శరీరాలూ, నడి వీధి పాలవుతున్న నిరాధార జీవితాలూ.... పత్రికలు తెరిచినా, టీవీ ఛానళ్లు తరచినా పదే పదే ఇవే... ఇలాంటివే! అంజలి వీటిని అధ్యయనం చేసింది. జంట నగరాల్లో ఫలక్‌నుమా, రెడ్‌హిల్స్, షాహీన్ నగర్, బజార్ ఘాట్, ఫరూజ్‌నగర్, యాకూత్‌పురాలాంటి నూట ఇరవై రెండు సమస్యాత్మక ప్రాంతాల్ని గుర్తించింది. అక్కడ అట్టుడికిపోతున్న అకృత్యాల్ని 'మై ఛాయిస్' బృందంతో అంజలి పరిశీలించింది.

✦✦✦✦✦✦✦

సరే! సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించాలన్న దృఢ సంకల్పమూ ఉంది. కానీ ఎలా? "బెల్ బజావో!" ఇది మహిళల సమస్యల్ని పరిష్కరించే ఉద్దేశంతో ఏర్పడ్డ సంస్థ. 'మై ఛాయిస్' వెంటనే వారిని సంప్రదించింది. తన బ్లూ ప్రింట్‌ను వివరించింది. మహిళలపై హింసాకాండ కొనసాగుతున్న ప్రాంతాల్లోకి చొచ్చుకుపోవాలి... బాధితుల్ని గుర్తించి, సమస్యల సుడిగుండంలోంచి బయటకు లాగాలి... అందుకు తగిన స్వచ్ఛంద సేవకులు కావాలి... వారికి ఎలాంటి శిక్షణనివ్వాలి అన్న విషయం గురించి మాట్లాడింది. తెలివైన వారినీ, చురుకైన వారినీ ఎంపిక చేసింది. హింసకు గురై, నిరాశ్రయులై, తమలాంటి వారి కోసం సేవలందించడానికి సిద్ధంగా ఉన్న వారిని బృందంలోకి తీసుకుంది. సుమారు ఎనభై మంది... నెలకు ఎనిమిది వేల రూపాయల గౌరవ వేతనం... 'బెల్ బజావో' నిపుణుల ద్వారా శిక్షణ... ఏర్పాట్లు పూర్తయ్యాయి.

✦✦✦✦✦✦✦

"మిమ్మల్ని పీస్ మేకర్లు అని పిలుస్తాం. మీరు బస్తీల్లో సాధారణ వ్యక్తుల్లాగే తిరుగుతూ, అందరితో స్నేహంగా ఉంటూ బాధితుల్ని గుర్తించాలి. వారికి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించి ధైర్యం చెబుదాం. పరిస్థితులు అధ్వానంగా ఉన్న వారికి ఆశ్రయం కల్పిద్దాం. ఉపాధి మార్గం చూపిద్దాం. మనం బడులకూ, కాలేజీలకు కూడా వెళదాం. వివక్ష, లైంగిక, శారీరక హింసల గురించీ... వాటిని ఎదుర్కొనే పద్ధతుల గురించీ అమ్మాయిలకు అవగాహన కల్పిద్దాం. తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ఏం చేయాలో మనసుకు హత్తుకునేలా వివరిద్దాం" అంటూ శిక్షణ పొందిన పీస్‌మేకర్ల బృందానికి అంజలి స్పష్టతనిచ్చింది. వారిని కార్యోన్ముఖుల్ని చేసింది. ఫలితంగా... ఏడాది కాలంలో నాలుగొందల పైచిలుకు కేసుల్ని 'మై ఛాయిస్' ఉద్యమ స్ఫూర్తితో పరిష్కరించింది. ముప్పై పాఠశాలల్లో ఆరొందల మంది విద్యార్థినులతో పీస్‌మేకర్లు మమేకం అయ్యారు. కట్టుకొన్న వాడూ కన్నతండ్రి అన్న తేడా లేకుండా దారుణమైన హింసలకు గురవుతున్న అభాగినుల్ని ఆదుకున్నారు. కష్టాలను వాటేసుకుని, కన్నీళ్లను దిగమింగి 'మై ఛాయిస్' సాయంతో గట్టెక్కిన వారిలో ఓ ఫాతిమా ఉంది... ఓ సుమతి ఉంది... ఓ అయేషా ఉంది. ఇలా ఎందరో ఉన్నారు!

✦✦✦✦✦✦✦

ఆమెను ఫాతిమా అని పిలుస్తారు. ఆమె భర్తకు ప్రేమ, దయ, అభిమానం లాంటివి అసలు లేవు. ఉన్నదల్లా అనుమానం. పైశాచిక ఆనందం. మాటలు తూటాల్లా పేల్చేవాడు. ఫాతిమా మనసును తీవ్రంగా గాయపరిచే వాడు. మనసులో గాయం. అతని కంటికి కనిపించదు కదా! అందుకే పదునైన చురకత్తితో ఆమె శరీరాన్ని గాట్లు పెట్టేవాడు. తట్టుకోలేక పారిపోవాలని ప్రయత్నిస్తే బాత్‌రూంలోకి బలవంతంగా నెట్టి, బయట తాళం వేసి, రెండ్రోజుల పాటు బంధించాడు. ఆమె ఏడ్చింది. అరిచింది. ఇరుగుపొరుగు వారి సాయంతో బయటపడింది. 'పీస్ మేకర్ల' సాయంతో 'మై ఛాయిస్' నీడలో చేరింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే... ఫాతిమా ఇప్పుడు 'పీస్ మేకర్'గా పనిచేస్తోంది.

✦✦✦✦✦✦✦

సుమతి హైస్కూల్లో చదువుకుంటోంది. తండ్రి తాగుబోతు. కామపిశాచి ఆవహించినట్లు కన్న కూతురి మీదే అఘాయిత్యం చేయబోయాడు. ఏడవడం తప్ప ఏమీ చేయలేకపోయింది! అలాంటి స్థితిలో పీస్‌మేకర్‌లతో అంజలి ఆ ఇంటి తలుపు తట్టింది. సుమతికి ఇప్పుడు భద్రత లభించింది.

అయేషా వయసు పద్నాలుగు. నలభై రెండేళ్ల వ్యక్తితో ఆమె పెళ్లి నిశ్చయించారు పెద్దలు. అమ్మాయి వద్దంది. చదువుకుంటానంది. ఇంట్లో వాళ్లు ఒత్తిడి చెయ్యబోతే అయేషా అరిచి గీ పెట్టింది. ఆ బాలిక ఆక్రందన ఓ పీస్ మేకర్‌కు వినిపించింది. 'మై ఛాయిస్' రంగంలోకి దిగింది. అయేషా ఇప్పుడు చదువుకుంటోంది.

""చెప్పాలంటే ఇలా ఎన్నో కథలు. అంతులేని వ్యథలు... సమస్యల పరిష్కారానికి సానుకూల వైఖరితో కూడిన పద్ధతుల్ని పాటించడంతో పాటూ అవసరమైతే పోలీసుల సాయాన్నీ, న్యాయవాదుల సహకారాన్నీ తీసుకుంటున్నాం. ఆర్థిక సాయం కోసం ఎవరి మీదా ఆధారపడటం లేదు. నా సంపాదనే 'మై ఛాయిస్'కి పెట్టుబడి. బాధితుల్ని సుడిగుండం నుంచి బయటకు తీసుకురావడంతోనే సరిపోదు. వారికి ఆశ్రయం ఇవ్వాలి. ఉపాధి కల్పించాలి. ప్రస్తుతం ఆ దిశగా ఓ పథకాన్ని రూపొందిస్తున్నాను" అన్నారు అంజలి.

– స్వాతి కొరపాటి, ఓలేటి శోభ